

# అవ్యక్తరాగం

రామలక్ష్మి

చంద్రం జీవితోద్యోగాన్ని కాస్సేపు సస్పెన్షన్‌లో ఉంచాలని బుద్ధి పుట్టింది భగవంతుడికి. అందుకే చంద్రం సస్పెన్షన్ ఫూల్ అయ్యాడు. ఆ సాయంకాలంవేళ అన్యాయంగా కళ్లనీళ్ళు పెట్టుకుంది మధుర.

జీవిత మధ్యమాకాశం ప్రాక్పశ్చిమాల్లో చంద్ర సూర్యులను ధరించి శూన్యంగా చూస్తున్నది ఏవంకకో. బహుశ వీరిద్దరి జీవితాన్నే కాబోలు! ఈ దంపతుల విచిత్ర సంఘర్షణనే తిలకిస్తోంది. స్త్రీ పురుష సహజమైన సంఘర్షణ అది.

మధుర కళ్ళు అశ్రువుల్ని వర్షిస్తున్నాయి. దించిన కనురెప్పలకు ఉత్తరంలోని అక్షరాలు మసక మసగ్గా కనిపిస్తున్నా నిస్సహాయంగా నిలుచుండిపోయింది. ఉత్తరాన్ని చదివీ చదవటంతో మధుర గుండెలమీద బలంగా సుత్తి దెబ్బలుపడి మనస్సుని మూర్ఛపోయేలా చేశాయి. ఇక ఆవిడకి చైతన్యం ఎక్కణ్నించి సరఫరా అవుతుంది?

మధురకి ఎదురుగా పాంటుజేబుల్లో చేతులుంచి రెప్పవాల్చకుండా తీవ్రంగా చూస్తున్నాడు చంద్రం, ఉచ్ఛ్వాస నిశ్వాస వేగాన్ని ఆపలేని అతని విశాల వక్షస్థలం తెల్లని షర్టు బటన్‌లను పూడబెరికేసేటంతగా ఉద్రేకపడుతుంది. మనస్సుని చీల్చి నగ్న సత్యాన్ని తెలుసుకుని మనశ్శాంతిని పొందుదామని ఉరకలు వేస్తున్న యువక రక్తపు వేడి ఆవేశంతో మధురవైపే తీక్షణంగా చూస్తున్నాడతను. కాని నిజం ఎలా తెలుస్తుంది? నిజా నిజాల్ని గ్రహించే ఘటన ఎలా ఏర్పడుతుంది? ఎక్కడుంటాడోగాని ఆత్మలన్నీ ఐక్యమై సంపూజించే సర్వేశ్వరుడికే అంతఃకరణల సాక్షిగ సత్యాసత్యాలు విదితమౌతాయి. అందుకే అతను పరమాత్ముడైనాడు. ఒక దొంగను శిక్షించి ఒక దొంగను రక్షిస్తున్నాడు. ఒక ధర్మాత్ముణ్ణి రక్షించి మరొక ధర్మాత్ముణ్ణి శిక్షిస్తున్నాడు. ఈ సాక్షి గ్రహణం, మనసులవల్లనూ, ప్రవర్తనలవల్లనూ ఏదో గ్రహించాలని తాపత్రయపడే మానవ మాత్రులకి అసాధ్యం.

ఉత్తరంలోని సంగతేమిటంటే అది చదవాలే గాని వేరే వివరించి చెప్పటం వృథా కాలయాపనే.

ప్రియమైన అత్తయ్యకు నమస్కరిస్తూ

దుఃఖంతో మధుర మీనాక్షి వ్రాయులేఖ. మామయ్యకు నా నమస్కారములు చెప్పు. ఇంతకీ నా నుదుటి గీత బాగులేదత్తయ్యా! నాన్నే ఉంటే నా కింత అన్యాయం చేసేవాడా? వెంకట్రావు మామయ్యా, నువ్వు నన్నెంత ప్రాణంగా చూసుకుంటారో తెలిసీకనే అమ్మ ఇంత మొండి పట్టుపడుతోంది. నిజానికి చిన్న మామయ్యనే నాన్న అస్తమానం దరిద్రుడంటూ తిట్టేవాడు. అదలా ఉంచి నాకు రవి బావ దగ్గరున్న చనువు చంద్రం దగ్గర ఎలా వస్తుంది? రవి బావనే నేను మనసారా ప్రేమించానని నీకు తప్ప మరెవరికి తెలుస్తుంది? నా హృదయ ఘోష నీకూ, భగవంతుడికీ తెలుసు. నా మనస్సు ఎవర్ని కోరుతున్నదో, ఎవర్ని మనస్ఫూర్తిగా పూజిస్తున్నదో ఈ క్షణాన చెప్పినా ఇక అమ్మ ఉద్దేశ్యం మారదు. ఆమె మార్చుకోదు. వివాహం దాదాపు నెల రోజుల్లో ఉంది. ముహూర్త నిర్ణయం కూడా జరిగిపోయింది. ఇక మిమ్మల్ని నేను కోరే దొక్కటే. ఇప్పుడున్నా లేకపోయినా ఈ వివాహ ముహూర్త సమయాని కొక సారివచ్చి దీవించి వెళ్ళిపొండి. ఇక మీకూ, రవి బావకీ నేను పరాయిదాన్నే అయిపోయాను. ఎంత అయిష్టంగా ఉన్నా చంద్రంకీ, ఆ చిన్న మామయ్య వాళ్ళకే సన్నిహితురాల్నవుతున్నాను. అమ్మను ఇంకా ఒప్పించాలని ప్రయత్నం చేయటం వృథా ప్రయాస అని నేను వ్రాసినట్లు మామయ్యతో చెప్పు. అత్తయ్యా! లేకపోతే అన్ని విధాల నాకే ప్రమాదం సంభవించొచ్చు. నా బాధనంతా నీ కడుపులో దాచుకో. పెళ్ళి రోజులు దగ్గరౌతున్నకొద్దీ నా మనసులో మంటలు మరీ పైకిలేస్తున్నాయి. కాని నువ్వు కంగారుపడకు. నేనేమీ అఘాయిత్యపు పని చేయనులే. ఇంతే సంగతులు. బావని మరీ మరీ అడిగినట్లు చెప్పు.

నీ కోడలు
మధుర.

ఆ ఉత్తరంలోని సంగతులు గుర్తు వస్తున్నకొద్దీ మధుర గుండెలు భయంతో జలదరించి పోతున్నాయి.

ఆ ఉత్తరంలోని సంగతులు గుర్తు చేసుకుంటున్నకొద్దీ చంద్రం మనస్సు భగ భగ మండి పోతున్నది.

"ఊఁ—నిజం చెప్పు! ఇది నువ్వు మనస్ఫూర్తిగా రాసిన ఉత్తరమేనా?" అని గర్జించాడు చంద్రం గంభీరంగా. ఎంత అణుచుకుందామన్నా అతని ఆవేశం అణగడంలేదు. ఎంత క్రూరమైన స్త్రీ?! ఈ సుకుమారమైన పెదవుల్లోనుంచేనా ప్రణయామృత వచనాలు ప్రవహించగా తను విన్నాడు? ఈ మనోహరమైన నేత్రాల్లో నే నా తను లజ్జాన్విత రేఖల్ని చూశాడు? ఈ సౌందర్యరాణికి మరో పేరు విషధారిణి అని గుర్తించలేకపోయాడు తను! అవును—రాక్షస స్త్రీలు కూడా దేవతా స్త్రీల రూపాలు ధరిస్తారు. దేవతల్ని అనుకరిస్తారు.

మధుర అనుకున్నది అదే సమయంలో ఈ ఉత్తరం తన అంతాన్నే, తన జీవితపు అంతాన్నే చూసేలాగే ఉంది. భారతదేశంలోని స్త్రీ జీవితానికి ఇటువంటి ఉత్తరం ఒక్కటే చాలు గొడ్డలి పెట్టు పెట్టడానికి. ఈ ఉత్తరం చంద్రాని కెలా వచ్చింది? ఇప్పటి కిప్పుడు ఇతని కెక్కడ దొరికింది? ఇంతలో ఇంత దురదృష్ట సంఘటన వెన్నాడి వస్తుందని తను అనుకుందా? చిత్రమైంది కర్మ. ఎన్ని ప్రశాంతానందతరంగానుభూతులైనా ఒక విషాదపు వెల్లువతోసరి! అతని కేమనిచెప్తే నమ్మగల డిప్పుడు? ఏమని చెప్తుంది తను?—

"ఏం? సమాధానం చెప్పవేం? నే నడిగేది వినిపిస్తోందా?"

మధుర ఉలిక్కిపడ్డది. అతని కళ్లల్లోకి చూడ లేకపోయింది సరిగ్గా. ఏ చిన్న సంఘటనకైనా తట్టుకునే ధీర గుణం కాదామెది.

నిలువెల్లా ఒణికిపోతూ, "నా కేమీ తెలీదు..... నిజంగానే నేను......" అంటుండగానే కంఠం అణిగిపోయి రెండు కన్నీటి బొట్లు కపోలాల మీదకి జాలువారాయి.

కొందరు పురుషులు స్త్రీల కన్నీటిలోనే 'నటన'ను చూస్తారు. సంఘటనల ప్రాబల్యమే కావచ్చు. అదేవిధంగా చంద్రం ఈసడింపుతో, అనుమానంతో, అపనమ్మకంతో చూశాడు మధుర దుఃఖించటాన్ని.

తృణీకారంగా చూస్తూ, "ఇంతమాత్రానికి ఏడుపెందుకు? నిజం చెప్పి నీ ఇష్టంవచ్చిన చోటుకు వెళ్ళొచ్చు" అన్నాడు కటువుగా.

"ఇంతకంటె ఏం నిజం చెప్పాలి?" రెండు సార్లు ప్రయత్నించి గద్గదకంగా ఈ ఒక్కముక్క అనగలిగింది మధుర.

"హు!" అని ఒక్క విరసపు నవ్వు నవ్వాడు చంద్రం. ఇద్దరి పరిస్థితీ అతిశయ స్థితిలో వస్తున్నది క్రమేణా.

వివాహానంతరం హనీమూన్ మధుర బృందావనాది పుణ్యలాభ పవిత్ర ప్రాంతాల్లో దివ్యంగా గడిపి, ఆ తోవనే తిరుగుదలలో తన పెద్ద తండ్రి ఆహ్వానాన్ని పురస్కరించుకొని వారింట దిగిన చంద్రానికి ఊహించని దుస్థితి తటస్థించింది. అతడి మనస్సు పూర్తిగా విరిగిపోయింది క్షణాల వ్యవధానంలోనే.

"నిజం చెప్పు మధురానువ్వు రవిని ప్రేమించావా? మాటిగా చెప్పటం మనిద్దరికీ మేలు!"

మధుర అలాంటి ప్రశ్న భర్త నోటినుండి విని సిగ్గుతో కుంచించుకుపోయింది. అతని మాటలకు గుండెల గోడలు ప్రతిధ్వనించి ఆ ధ్వనులు చెవులకు కఠినంగా వినిపించాయి. 'ఛీ' అనబోయి ఆగిపోయింది. ఆ ఒక్క ఉచ్చారణవల్లనూ అతని అనుమానం ధృవపడుతుందేకాని తగ్గదు.

చివరికి తడి ఆరిన పెదాలు కదిలాయి అతి కష్టంగా:

"మీరు నమ్మినా నమ్మకపోయినా చెప్తున్నా. వివాహానికిముందు మీ ఇద్దర్నీ సమానంగానే అభిమానించేదాన్ని నేను. జ్ఞాన మున్నదాన్ని కనుక మీలో ఏ ఒక్కరిపైనా అమితమైన మమతల్ని పెంచుకోలేదు. నా అదృష్టంవల్ల మీతో నా అభిమానబంధం గట్టిపడింది .....నిజంగానే నా కా ఉత్తరం సంగతి ఈ క్షణమాత్రం కూడా తెలీదండీ!" అంది మధుర తగ్గిపోతున్న స్వరంతో

చంద్రం సిద్ధంగా ఉన్నాడు. "నామీద ఒట్టు వేసి చెప్పగలవా?"

కంటికొనల్లోంచి చంద్రం చూస్తుంటే కత్తుల బోనులో ఇరుక్కున్నట్లు బాధపడింది.

"మీ సాక్షిగా, నా ఆత్మసాక్షిగా నే నీ ఉత్తరం రాయనేలేదు."

"అవునుమరి. నేను చస్తేమాత్రం నీ కొచ్చే నష్టమేముందిలే?"

మధుర కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. అయినా ప్రయత్నంమీద ఆపు చేసుకుంది. ఇంకా ఆశాదీపం రెపరెపలాడుతూంది ఆ గాలి హోరులోనే.

"మీరిలా అంటారని నాకు తెలుసు. అందుకే మీమీదే కాకుండా నామీద కూడా ఒట్టువేసుకున్నాను. మీకన్నా నాకు మరో ఆశ ఉంటే అబద్ధం చెప్పి నశించి పోవడానికి భయపడనా చెప్పండి?"

ఆమె ఉద్రేకాన్ని గమనిస్తూనే అన్నాడు చంద్రం, వ్యంగ్యంగా నవ్వి. "నువ్వు ఒట్టు బాగా నమ్ముతావన్నమాట?"

మధుర తెల్లబోయింది.

"ఊఁ సరే నీ రైటింగు పరీక్ష చెయ్యాలి! ఇదిగో పెన్ను. కాయితం తీసుకురా!"

యాంత్రికంగా కాయితం తెచ్చింది. వ్రాయమని హెచ్చరించాడు చంద్రం. విధిలేక వ్రాసింది.

"మధుర మీనాక్షి చంద్రశేఖర్"

"నా పేరు వ్రాసేం లాభం? ఆ రవిగాడి పేరు రాయ్!"

"నేను రాయను"

"ఏం? ఎందుకని?"

"నా కిష్టంలేదు."

"అతనిష్టమైనా అతని పేరు ఇష్టం లేదన్నమాట!"

"సరే చూసుకోండి!" గద్గదికంగా అనికాగితం ముక్కమీద రవి పేరు వ్రాసి చూపింది. ఆ వ్రాతకీ ఈ వ్రాతకీ చాలా భేదం కనిపించింది.

"ఏమో నేను నమ్మలేను! చేతి వ్రాతలు మార్చి రాసే వాళ్ళెందరులేరు? దీనికి నీ సమాధానం?"

మధుర రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవ సాగింది. అంతవరకు ఆగిన దుఃఖం అవిరళాశ్రు ధారల రూపంలో బయల్వెడలుతోంది.

"నీ ఏడ్పులూ, నా మొరలా ఇవేవీ నాకు మనశ్శాంతి నివ్వలేవు. పెట్టె సర్దుకో నిన్ను మీ వాళ్ళింట్లో దిగవిడిచి నా దారిన పోతాను—ఆలస్యం చెయ్యక తయారుకా!"

మధుర వినిపించుకునే స్థితిలో లేదు లా ఒక్కింతయులేదు అని హృదయం ఘోషిస్తున్నట్లుంది.

ఇంతలో ఇంట్లో ఏదో పెద్ద అలజడే లేచింది. ఆ గొడవ హాలుపైరకూ రావడంతో అక్కడ అందరూ గుమిగూడారు. చంద్రమూ, అతని వెనుక మధురా కూడా తమకు కేటాయించిన గదిలోంచి బయటపడి నిర్జీవ ప్రతిమలా నిలుచున్నారు

ఇంతకీ అది బయటి వాళ్ళకి చిన్న విషయంగాను, ఇంట్లో వాళ్ళకు పెద్ద విషయంగాను ఉంది. ఇంట్లో పనిమనిషి ఎందుకో యజమానురాల్నే ధిక్కరించి పెద్ద గొంతుకతో దెబ్బలాడుతున్నది.

చంద్రాన్ని చూసి అతని పెద్ద తండ్రి పెళ్ళాం కాంతమ్మ ముందుకొచ్చి ఏదో చెప్పబోయింది.

అప్పుడే గుమ్మంలో అడుగు పెట్టిన రవి

# అవ్యక్తరాగం

"సెమిటమ్మా ఆవా కావ్యాలకేం?" అన్నాడు ఆ కుంభకర్ణ సంఘంలో తానొక మెంబరవుతూ.

తంద్రంతో చెప్పబోతున్న కాంతమ్మ ఇటు తిరిగింది రవి వైపుకి. "చూడురా నాన్నా! దీని కెంత పొగరో చూడు! తలంటుకుంటూ గూట్లో పెట్టిన ఉంగరం, అచ్చమైన స్వచ్ఛమైన బంగారపు టుంగరంరా! పొద్దున్న తీసుకోడం మరిచి పోయి ఇప్పుడు ఒక్క అదటునవెళ్ళి చూద్దును కదా అక్కడ మరి కనిపించలేదు. ఉంగరం చూశావా అని దీన్ని ఇట్లా ఒక మాటు అడిగానో లేదో అప్పుడే దీని కెంత పౌరుషం ముంచుకొచ్చింది. విలువైన వస్తువు పోయిందన్న ఇంగితం ఏమన్నా ఉంటుందంటావా దీనికి? మళ్ళా పది సంవత్సరాలుగా జీతమూ, బత్తెమూ మస్తుగా పుచ్చుకుంటూనే ఉన్నది. ఇంట్లో మనిషిలా చూసుకుంటోన్న దీని కేమన్నా ఆలోచన ఉందా అంటాను. ఒక వంక ఉంగరం పోయిందనే గుండెలు బాదుకోనా? దీని అభిజాత్యానికే మండిపడనా? ఇంతకీ ఈ ముండని నేనేమీ అనలేదు. ఉంగరంగాని చూశావా అన్నాను అంతే!"

కాంతమ్మ ఆగీ ఆగటంతోనే అంతవరకు రొప్పుతున్న మంగి గల గల్లాడుతూ ఆమెను ఎదుర్కొంది.

"అబద్ధమాడకమ్మా! ఇందాకిందాక ఏమంటివి? ఉంగరం తీశావా అని మొగ మెడాటే అనెయ్యలా? పదేళ్ళుగా మీ ఇంటబడి అడ్డమైన చాకిరిచేసి చులకనైపోయినాము. లేకుంటే ఒక్క మాట అనిపించుకుంటినా ఇన్నాళ్ళా......" అంది మంగి.

ఆపైన కాంతమ్మ తారాజువ్వలా లేచింది. రాను రాను తగువు చినికి చినికి గాలి వాన అయి పట్టుయింది అంతరంగంలో తుఫాను, అవతల గాలివాన అన్నట్టు చంద్రమూ, మధుర బెంబేలెత్తిపోయారు. చివరికి రవి మంగిని గట్టిగా తిట్టి పొమ్మన్నాడు.

"ఎల్తానెల్తాను. ఈపాడింట్లో ఎవడుంటాడు! ఈమంగను దొంగన్న ఎదవ నోరు పడిపోను!" అంది మంగి మెటికలు విరిచి వెళ్ళిపోతూ.

"నోరు మూసుకుని పోవే దొంగముండా! నువ్వు కాకపోతే సీతాతలాంటి దాన్ని తెచ్చుకుంటాం!" అంది కాంతమ్మ నిప్పులు కక్కుతూ.

మంగి మళ్ళీ కోపంతో వెనక్కొచ్చింది. ఈసారి దానికి బాగా ధైర్యం వచ్చింది.

"ఏటమ్మా! నీ అరుపులికి దడిసిపోతాననుకున్నావా? పదిసంవత్సరాలుగా మీయింట్లో నేసేసినంత సాకిరి, దానమ్మకడుపుకాల ఎవత్తె సెయ్యగల్దో నేనూడనూ, మీనాటి దగుల్బాజీ మనుసులకాడ ఎవత్తె మసులుకోగల్దో నే నూడనూ?"

"ఏయ్! నోరుమూసుకుని ఇక్కణ్ణించి కదుల్తావా? పోలీసుల్ని తెప్పించమంటావా?" గర్జించాడు రవి.

మంగి చలించకుండా కాంతమ్మవైపే గుడ్లురిమి చేసి చూస్తున్నది.

"మెక్కినన్నాళ్ళూ పీక ల్దాకా మెక్కి ఉన్నింటికే ఎంతలేసి మాటలంటున్నావే పాడూ!—ఫో ఫో— నువ్వెంత తొరగా పోతే అంత తొరగా శని విరగడౌద్ది" అంది కాంతమ్మ.

వెటకారంగా చేతులు తిప్పుతూ "అవునమ్మా. అవునవును. మంచి మాట సెప్పావు నాతల్లే! మీశని కాదు నాశనే ఇవ్వాల ఇరగడవుతున్నాది. మీయింట్లో పనిసెయ్యడమే నా పాపం. మీబుద్ది లెట్లాంటివో నాకు మాబాగా తెలిసినా, పదేళ్ళుగా విశ్వాసం కొద్దీ పడున్నాను. మీ ఎవహారాలుతెలిస్తే ఎవడుంటాడు ఈ కొంపలో? మీబాబు లంచాలు మింగడం ఎరగనా? మీరు బేరాలు కొట్టి లాగే డబ్బుసంగతి ఎరగనా? మీ[illegible]గా సేమ ఎవహారం ఎరగనా? మేష్టరు బా[illegible]బ్బులు లచ్చలు లంచాలు ఎరపెట్టి మీ అబ్బాయి[illegible] సేము సేయించడం నాకు తెలవదా? ఇదిగో ఈ సెంద్రంబాబుగారికి మధురమ్మగార్ని దక్కనివ్వకండా సెయ్యాలని, ఆస్తికోసం మధురమ్మని రవి బాబు సేసుకోవాలని మీరు పన్నిన పన్నాగాలు, మీ రాడిన అబద్దాలు, మీ[illegible]రాసి[illegible] దొంగుత్తరాలు నాకు తెలవ్వనుకున్నారా? ఛీ! ఇట్లాంటి ఇంట్లో నే నొక్క నిమసం కూడా ఉండనింక. నా జీతం డబ్బులు మీకాడే ఉంచుకోండి!" గుక్క తిప్పుకోకుండానే పూడిన కొప్పు ముడేసుకుంటూ చర చరా వెళ్ళిపోయింది మంగి.

కాంతమ్మతో సహా అక్కడున్న వాళ్ళంతా స్థాణువులైపోయారు. మధుర, చంద్రం ఇద్దరూ కూడా తమకు వినిపించిన వాక్యాలు వాస్తవంగా వినబడ్డాయా అనే భ్రాంతిలో కొన్ని క్షణాలు ఉండిపోయి ఒకేసరి ఉనికిని గుర్తు తెచ్చుకున్నారు.

మధుర చంద్రంవైపు చూసింది ఇంకా అయోమయంగా. చంద్రానికంతా అర్థమైపోయింది. ఇందాక తను చూసిన ఉత్తరం ఎప్పుడో కల్పించి వ్రాయబడినది. మధుర కళ్ళల్లోకి అదే క్షణాన చూస్తూ సిగ్గుతో పశ్చాత్తాపంతో కరిగిపోయి.

"మధూ!" అన్నాడు గద్గదికంగా — ఆమె దగ్గరకు నడుస్తూ. సరిగ్గా అప్పుడే ఉప్పెనలా ఉద్రేకం అతన్ని ఆవహించింది. చటుక్కున మధుర చెయ్యి పట్టుకుని, "పద మధూ! ఇక్కడ మనం ఒక్క క్షణం ఉండొద్దు! వీళ్ళు మనుష్యులుకారు రాక్షసులు! పెద్ద తల్లి తండ్రుల రూపంలోఉన్న కిరాతకులు!" అన్నాడు క్రోధంతో, ఆవేశంతో.

*      *      *

ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. రవి తండ్రి వెంకట్రావూ, చంద్రం తండ్రి శ్రీనివాసరావు ఏకోదరులైనా అభిప్రాయ భేదాలవల్లనూ, విరుద్ధ స్వభావాలవల్లనూ ఆస్తులు పంచుకుని ఏనాడో విడిపోయారు. వాళ్ళిద్దరికీ కూడా చెల్లెలు సుశీలమ్మమీద అమిత మమకారం ఉంది. మధురని కోడలుగా చేసుకోవాలని ఇద్దరూ ఉబలాటపడ్డారు. రవికన్న చంద్రం పెద్దవాడని మధురను అతనికివ్వడానికే నిశ్చయించుకుని, ఆ ఉద్దేశాన్ని మరి మార్చుకోలేదు సుశీలమ్మ. మధుర ఆస్తిమీద కూడా ఒక కన్నువేసి ఉంచిన వెంకట్రావు ఎన్ని ఎత్తులు వేసినా ఫలించకపోవటంవల్ల నిరాశ చెందాడు. కడుపులో ఉక్రోషమున్నా బంధువర్గంలో మంచివాడనిపించుకోవాలని చంద్రాన్ని, మధురను వివాహానంతరం తమ ఇంటికి ఆహ్వానించాడు. పర్యవసానంగా చంద్రం సందేహంలో కొట్టుమిట్టాడవలసి వచ్చింది కొన్ని గంటలు. అదృష్టవశాత్తు అనుమాన మేఘాలు చెదిరిపోయి జీవితాకాశం వినిర్మలంగా భాసించింది.

సామానుతో రిక్షా ఎక్కి వెళ్ళిపోతున్న నవదంపతుల్ని చూస్తూ దిక్కుతోచిలా నిలబడిపోయింది కాంతమ్మ.

ఆకాశంలో అవ్యక్తరాగం అలుముకుంది. జీవితంలో వినిపించే సంధ్యా గీతాలన్నీ మధుర గీతాలే అనిపించాయి మధురకి. • ★

